క్లుప్తంగా

కామర్స్ కోర్సులకు మంచి భవిష్యత్తు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో 18వ ర్యాంకు సాధించిన శ్రీమేధ విద్యార్థి షేక్ మొహమ్మద్ అలీని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అభినందించారు. పొత్తూరువారి తోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం శ్రీమేధ విద్యాసంస్థల చైర్మన్ అన్నా నందకిశోర్ తమ విద్యార్థి షేక్ మొహమ్మద్ అలీతో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కామర్స్ కోర్సులైన సీఏ, సీఎంఏ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వీరి పాత్ర గణనీయమైనదని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులను కామర్స్ ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దుతున్న శ్రీమేధ విద్యాసంస్థలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటరీ కోశాధికారి కొనకళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రక్తనాళాల వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం

నగరంపాలెం: వాసవీ క్లబ్ గుంటూరు, ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి సంయుక్తంగా ఆర్.అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ఆవరణలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత రక్తనాళాల వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 108 మంది వృద్ధులకు ఉచిత బియ్యం, పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జెడ్పీ ప్రాంగణాన్ని శుభ్రం చేసిన అధికారులు



గుంటూరు ఎడ్యుకేషన్: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజా పరిషత్ అధికారులు, ఉద్యోగులు శనివారం కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు చీపుర్లు చేత పట్టారు. ఆవరణను ఊడ్చి, చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో వేశారు. వివిధ సెక్షన్లలో బూజును దులిపి, శుభ్రం చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ కళా వేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. శరణ్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీ (గురు యశోద ఠాకూర్, హైదరాబాద్) నర్తకీమణులు బొల్లా సిరిచందన, కె.శ్రీనిధి, సంయుక్తా భరత్ చక్కని హావభావాలతో నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు కాజా వెంకటసుబ్రహ్మణ్యం, చైర్మన్, కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కన్వీనర్ చంద్రమోహన్, భూసురపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చివరగా కళాకారులను సత్కరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: షాపు ముందు పార్కింగ్ చేసి పది నిమిషాల్లో తిరిగి వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం చోరీపై పట్టాభిపురం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ గుంటూరులోని జేకేసీ కళాశాల వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని ఉదయం 10 గంటలకు వచ్చి పార్కింగ్ చేసి వెళ్లాడు. పది నిమిషాల తరువాత వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల పరిశీలించినా వాహనం కనిపించలేదు. దీంతో దిక్కుతోచక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్లమూడి మాజీ సర్పంచ్‌పై దాడి

చేబ్రోలు: వడ్లమూడి గ్రామ మాజీ సర్పంచ్‌పై అదే గ్రామానికి చెందిన యువకుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం ఉద్రిక్తత పరిస్థితికి కారణమైంది. మాజీ సర్పంచ్ షేక్ బుడేపై అదే గ్రామానికి చెందిన యువకుడు దేవభక్తుని మధు హోటల్‌లో ఆకస్మికంగా దాడి చేశాడు. వృద్ధుడైన షేక్ బుడే ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న యువకులు దాడి చేసిన మధుకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ షేక్ బుడేపై జరిగిన దాడి రెండు సామాజిక వర్గాల మధ్య వివాదంగా మారడంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది.

- ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోని వాహనదారులు
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలకు గురవుతున్న యువకులు
- జరిమానాలు విధిస్తున్నా లెక్కచేయని పరిస్థితులు

■ ఇటీవల గుంటూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఒక **కుటుంబం ద్విచక్ర వాహనంపై వెళుతూ సెల్‌ఫోన్** కారణంగా ప్రమాదానికి గురైంది. వాహనం న**డుపుతున్న కుటుంబ పెద్ద సెల్‌ఫోన్‌లో** మాట్లాడుతూ పరధ్యానంలో పడ్డారు. రోడ్డుపై **ఉన్న గుంతలో పడి ఆయనతో పాటు భార్య,** పాప కింద పడిపోవడంతో గాయపడ్డారు.

■ పొన్నూరు రోడ్డులో ఒక యువకుడు వాహనం**పై సెల్‌ఫోన్ మాట్లాడుతూ** మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ **గాయపడ్డారు.**



సొల్లుఫోన్‌లో లీనం.. ప్రాణాలు పణం

పట్నంబజారు: నగరంలో నిత్యం వేలాది మంది బైక్, కార్లలో ప్రయాణం చేస్తున్నారు. అసలే రద్దీ ప్రాంతం కావడం.. దీనికి తోడు సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఇబ్బందులకు గురి చేస్తోంది. ఫోన్‌లో లీనమై ప్రాణాలనే పణంగా పెడుతున్నారు. చుట్టుపక్కల వస్తున్న వాహనాలను కూడా పట్టించుకోవడం లేదు. వారితో పాటు ఇతరులను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ఇటీవల జరుగుతున్న అధిక ప్రమాదాల్లో 27శాతం సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయని గణంకాలు చెబుతున్నాయి. కేవలం ఏడాది కాలంలో 1,052 కేసులు నమోదయ్యాయి. స్పెషల్ డ్రైవ్‌లతో ఇప్పటి వరకు గత ఆరు నెలల్లో పోలీసులు 342 కేసులు నమోదు చేశారు. అయితే, వీటిలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు వేళ్ల మీద లెక్క పెట్టుకోవచ్చు.

ఇయర్ ఫోన్స్.. బడ్స్‌తో ప్రయాణం

సెల్‌ఫోన్ నేరుగా మాట్లాడటంతో పాటు ముఖ్యంగా యువత, విద్యార్థులు ఇయర్ ఫోన్స్, బడ్స్‌ను చెవులకు అమర్చుకుని వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు. దీంతో పాటు కొందరు ఇయర్ ఫోన్‌లతో పాటలు వింటూ వాహనాలు నడుపుతున్న పరిస్థితులు ఉన్నాయి. డ్రైవింగ్ చేసేటప్పుడు ఇయర్ ఫోన్, బడ్స్ వాడకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా పాటలు వింటూ ముందుకు సాగడం ప్రమాదాలకు పిలుపు నివ్వడమే అవుతుంది.

ఆటోల్లోనూ స్టీరియో మోత

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఒక ఇబ్బందికరమైన విషయం అయితే.. ఆటోల్లో బ్లూటూత్ ద్వారా కనెక్ట్ చేసి స్టీరియోల్లో భారీ సౌండ్‌లు పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న పరిస్థితులు అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. పెద్దఎత్తున సౌండ్ చేసుకుంటూ నడపటం వల్ల వెనుక వచ్చే వాహనాల హారన్ సౌండ్‌లు కూడా వినపడని దుస్థితి దాపురిస్తోంది. కళ్ల ముందే ఆటోవాలాలు వాహనాలు నడుపుతున్నప్పటికీ కనీసం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోల్లో స్టీరియోల మోత అరికట్టాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

నిబంధనలు బేఖాతరు

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే క్రమంలో పలువురు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. సిగ్నల్ జంప్, స్నేక్ డ్రైవింగ్‌తో రోడ్డుపై వెళుతూ వాహనదారులకు తలనొప్పిగా మారుతున్నారు. సిగ్నల్ జంప్‌కు సంబంధించి ఈ ఏడాది రెండు నెలల కాలంలో ఇప్పటి వరకు 350పైగా కేసులు నమోతయ్యాయని పోలీసులు తెలిపారు.



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ..

చర్యలు తీసుకుంటాం

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా డ్రైవింగ్ చేసినా..ఆటోల్లో పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ, స్టీరియో సౌండ్‌లతో నడిపిన కఠిన చర్యలు తప్పవు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపటం ద్వారా, మనతో పాటు ఇతరులకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనదారులంతా బాధ్యతగా వ్యవహరించాలి.

– ఎం. రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్

సంత్ శ్రీ సేవాలాల్ మార్గం ఆదర్శనీయం



ఏఎన్‌యూ: సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ మాట్లాడుతూ సేవాలాల్ అహింసా వాదం ఆదర్శనీయమని తెలిపారు. 17 వ శతాబ్దంలోనే ఆయన ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడిలు అరికట్టడం వంటి ఉద్యమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. సంస్కృతిని కాపాడుకోవడానికి సంత్ సేవలాల్ విస్తృతంగా ధర్మ ప్రచారం చేశారని వివరించారు. సేవాలాల్ తెలుగువారు కావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ గంగాధర్, యూనివర్సిటీ కార్యదర్శి వంశీ, ఆర్ట్స్ కళాశాల అధ్యక్షుడు రాజేష్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలి

నెహ్రూనగర్: నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఈనెల 18న జరిగే ఔట్ సోర్సింగ్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఈదుల మూడు మధుబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, సీనియార్టీ బట్టి ఇంక్రిమెంట్లుంతో పాటు పలు డిమాండ్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణలో విప్లవాత్మక మార్పులు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ ద్వారా పారిశుద్ధ్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నామని, అందులో భాగంగా వార్డు సచివాలయాల వారీగా సూక్ష్మ ప్రణాళిక సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రాడీపేట 5వ లైన్ నుంచి సీనియర్ సిటిజెన్స్, జిల్లా జైలు అధికారులు, ట్రెజరీ అధికారులతో కలిసి స్వచ్ఛత ర్యాలీ, పరిసరాలలో మాస్ క్లీనింగ్, మొక్కలు నాటి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలసి మాస్ క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం ఒక థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఫిబ్రవరికి 'సోర్స్ రీ సోర్స్'ని ప్రకటించిందని, అందులో భాగంగా శనివారం నగరపాలక సంస్థ 206 వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీ, అవగాన కార్యక్రమాలు, మాస్ క్లీనింగ్ చేపట్టినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను నగర ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, తడి, పొడి చెత్త వేరు చేసి ప్రజారోగ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, జిల్లా జైలు అధికారులు వీరేంద్ర ప్రసాద్, కిరణ్ కుమార్, తేజస్, ప్రేమ్ సాగర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర రావు, ప్రభుదాస్, నోడల్ ఆఫీసర్ రాంబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలి

నగరంలో ఖాళీ స్థలాల యజమానులు వాటిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. రోజు వారీ పర్యటనలో భాగంగా శనివారం కమిషనర్ ఐపీడీ కాలనీ, ఎల్ఆర్ కాలనీ, సంగడి గుంట, వినాయక నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసాల మధ్యలో ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో ఉండి తీవ్ర అసౌకర్యంగా ఉందని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. స్థల యజమానులను గుర్తించి నోటీసులు అందించాలని, స్పందించని పక్షంలో నగర పాలక సంస్థ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నివాస ప్రాంతాల్లో పందుల పెంపకం నిషేధమని, యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

విచక్షణతో సమాచార ప్రసరణ ఉండాలి

ఆచార్య కె.రత్న షీలామణి

ఏఎన్‌యూ: నేటి ఆధునిక సమాజంలో సమాచారం ఎంతో కీలకమైందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య రత్న షీలామణి అన్నారు. యూనివర్సిటీలోని వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగం ఆధ్వర్యంలో 'బిజినెస్ అనలిటిక్స్–ఇంటెలిజెన్స్‌లో పురోగమనాలు' అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు శనివారం ముగింపు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార ప్రసరణలో మానవీయకోణం అవసరమని, వాస్తవంగా కూడా ఉండాలని తెలిపారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసంతో, సమాజంపై అవగాహనతో భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. సదస్సుకు ఏఎన్‌యూ కామర్స్– బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగ పీఠాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. సదస్సులో అధ్యాపకులు కనకదుర్గ, రత్న కిశోర్, నాగరాజు, విష్ణు, భానుచంద్రారెడ్డి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐపై విషయ పరిజ్ఞానం అవసరం

సమకాలీన సమాజంలో కీలకమైన భాగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఉద్భవించిందని, విద్యార్థులకు దీనిపై విషయ పరిజ్ఞానం ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. దీనిపై గత రెండు రోజులుగా వర్సిటీలో జాతీయస్థాయి సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఏఐ పరివర్తనాత్మక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాదులోని వర్ధన్ డేటా సైన్స్ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సదస్సులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు కె.లావణ్య, జి.నీలిమ, యు.సూర్య కామేశ్వరి, ఆర్.వసంత, పుష్పలత, బసవేశ్వరరావు పాల్గొన్నారు. పరిశోధక విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న రత్న షీలామణి



విద్యార్థికి పరిశోధన పత్రాన్ని అందజేస్తున్న వీసీ


రేషన్ బియ్యం, పంచదార నిల్వపై కేసు నమోదు

లక్ష్మీపురం: రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన ఓ మహిళను, మరో వ్యక్తిని సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన పాలేటి కుమారి వద్ద సునీల్ కుమార్ అక్రమంగా 1,550 కిలోల రేషన్ బియ్యం, 28 కిలోల పంచదార నిల్వ ఉంచాడు. సమాచారం తెలుసుకున్న సివిల్ సప్లై డెప్యూటీ తహసీల్దార్ దుర్గారావు ఈనెల 13న ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం, పంచదారను పట్టుకుని పాలేటి కుమారి, సునీల్ కుమార్‌లను అదుపులో తీసుకున్నారు. నిల్వ ఉంచిన బియ్యం, పంచదారను సీజ్ చేశారు. ఇద్దరిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ రూ.6.80 లక్షలు మోసం

లక్ష్మీపురం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి బాధితుల నుంచి రూ.6.80లక్షలు నగదు తీసుకుని హైదరాబాద్‌లో రెండు నెలలు పని చేయించుకుని జీతం కూడా ఇవ్వకుండా మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ పేట 8వ లైన్‌కు చెందిన గోపిశెట్టి సాయి పవన్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో విక్టోరియా జాబ్ సర్వీస్ పేరుతో హిమబిందు ఫోన్ ద్వారా సాయి పవన్‌ను సంప్రదించింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమ సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు సర్వీస్ చేస్తుందని చెప్పి నమ్మబలికింది. దీంతో గోపిశెట్టి సాయి పవన్‌తో పాటు అతని స్నేహితులు మరి కొంత మందితో కలిసి హిమబిందుకు రూ.6.80 లక్షలు నగదు ఇచ్చారు. కొన్ని రోజుల తరువాత హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో రెండు నెలలు పని చేయించుకున్నారు. దీనికి కూడా జీతం ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇదేంటి అని నిలదీయడంతో కంపెనీ మూసేసినట్లు చెప్పారు. బాధితులు హిమబిందుకు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదు. దీంతో దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రేష్ఠ హాస్పిటల్‌లో పెరిఫెరల్ బెలూన్ యాంజియోప్లాస్టీ సేవలు



గుంటూరు మెడికల్ : గుంటూరు పరిసర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో శ్రేష్ఠ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి పేర్కొన్నారు. 55 సంవత్సరాల వయస్సున్న రోగికి కాళ్లలో రక్తప్రసరణ పూర్తిగా నిలిచిపోయి తీవ్రంగా నొప్పితో బాధపడుతూ తమ హాస్పిటల్‌కు వచ్చినట్లు తెలిపారు. అతడికి వైద్య పరీక్షలు చేసి పెరిఫెరల్ బెలూన్ యాంజియోప్లాస్టీతో బాధ నుంచి ఉపశమనం కలిగించినట్లు తెలిపారు. క్లిష్టమైన కేసులతో పాటు ఈ వారంలో అతి క్లిష్టమైన హార్ట్ బైపాస్ సర్జరీలు కూడా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ హేమచందర్ కొరప్రాటి మాట్లాడుతూ కార్డియాలజీ విభాగంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

శివజ్యోతికి పీహెచ్‌డీ ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మాస్యూటికల్ బయో టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జొన్నా శివజ్యోతికి హైదరాబాద్ జేఎన్‌టీయూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. ''పుల్లులనేజ్, లాకేజ్ సూక్ష్మజీవుల నుంచి ఉత్పత్తి, శుద్ధీకరణ: జీవ సంబంధమైన అనువర్తనాలు'' అనే అంశంపై నెల్లూరులోని స్వాతి ఫార్మసీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ కడింపాటి కిశోర్ కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా పొందినట్లు వివరించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, సహచర అధ్యాపకులు శివజ్యోతికి అభినందనలు తెలియజేశారు.

లక్ష్మణరావు ఎన్నికల ప్రచారం

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు నగరంలోని బీఆర్ స్టేడియం, కొరిటిపాడు వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో శనివారం ఉదయం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా శాసనమండలిలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సమస్యలపై గొంతెత్తి మాట్లాడానని తెలిపారు. ప్రస్తుత ఆంధ్ర రాష్ట్ర రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజావాణి వినిపించే గొంతు అవసరమని చెప్పారు. ఆయన వెంట ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ఎం.కళాధర్, రాజశేఖర్, సూర్యారావు, భాస్కరయ్య, కె.నళినీకాంత్, ఎం.ఎ.చిష్టి, బి.లక్ష్మణరావు, బి. ముత్యాలరావు, కె.గంగాధరరావు, ఎల్.అరుణ, మురళి, కె.సుధీర్, ఎస్‌కే సమీర్, ఎస్.కార్తిక్, ఎస్‌కే ఖాశిం షహీద్ పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారం

లక్ష్మీపురం: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో అన్ని ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు గెలిపించుకోవాలని గుంటూరు నగర భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి. దీవెనరావు అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్, వెంగళరావు నగర్‌లో గెలుపు కోరుతూ శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దీవెనరావు మాట్లాడుతూ కార్మిక వర్గానికి నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి లక్ష్మణరావు అని తెలిపారు. రైతులు, ఉద్యోగుల సమస్యపై పోరాడుతూ, శాసన మండలిలో వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసే వ్యక్తి లక్ష్మణరావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు మురికిపూడి సారథి, సీఐటీయూ నాయకులు కె.శ్రీనివాసరావు, పోలే విమల్ కుమార్ పాల్గొన్నారు.



ప్రచారంలో లక్ష్మణరావు తదితరులు

విద్యావంతులైన మహిళలు ప్రగతికి దిక్సూచీలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యావంతులైన మహిళలు సమాజ ప్రగతికి దిక్సూచీలుగా నిలుస్తారని వైద్య ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం 83వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ శనక్కాయల అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో విద్యార్థినిగా గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్యోత్యానికి పూర్వమే మహిళలకు విద్యను అందించడం కోసం లేడీ హోప్ పేరుతో గుంటూరు నగర నడిబొడ్డున స్థాపించిన మహిళా కళాశాల స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ విద్యకు ప్రాముఖ్యతను అందించిందని తెలిపారు. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థినుల కోసం మూడు తరగతి గదులను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యతో పాటు సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం లింకన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ సుబ్బరత్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అరుణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగరంపాలెం: జిల్లాలోని హోంగార్డులంతా ఒక రోజు వేతనాన్ని తోటి ఉద్యోగి కుటుంబానికి అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. డీజీపీ కార్యాలయం సాంకేతిక విభాగంలో పనిచేసే హోంగార్డు ఎం.మాలకొండయ్య గతేడాది నవంబర్ 20న గుండెపోటుతో మృతి చెందారు. దీంతో హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.27 లక్షల చెక్కును శనివారం అతని భార్య ఆదిలక్ష్మికి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీ సతీష్ కుమార్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఎస్ఐ రాజారత్నం, జిల్లా హోంగార్డు ఎన్‌సీఓ హెచ్‌సీ కరీముల్లా పాల్గొన్నారు.